ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 | సంచిక : 03 | నవంబరు 2018

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ|| 150/-
విడి ప్రతి : రూ|| 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

16-12-1983
కాపవరం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-12-1983, కాపవరం)

హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రంలో కౌరవులకు, పాండవులకు మధ్య యుద్ధం జరిగింది. ఒక పక్క కౌరవసేన, ఒక పక్క పాండవసేన నిలబడి ఉండగా, మధ్యన భగవంతుడు వాసుదేవస్వామి అర్జునుడికి చెప్పిన శాస్త్రం గీతాశాస్త్రం. రథం నిలబెట్టి గీత చెప్పిన చోటు కురుక్షేత్రంలో జ్యోతిసర్ అనే స్థలం. ఇది భగవంతుడి ముఖంలోంచి వచ్చిన మోక్షశాస్త్రం, యోగశాస్త్రం. గీతాశాస్త్రానికి చాలా గౌరవం ఉంది. ఇది కేవలం భారతీయులకే కాదు, ప్రపంచంలో మానవ జాతి అందరికీ పనికివచ్చే శాస్త్రం.

గీత చెప్పి ఐదు వేల సంవత్సరాలు అవుతోంది. స్వామి చెప్పారు, అర్జునుడు విన్నాడు, రాసినవాడు వ్యాసుడు. చెప్పినవాడు నారాయణ స్వరూపుడే, విన్నవాడూ నారాయణ స్వరూపుడే, రాసినవాడూ నారాయణ స్వరూపుడే.

కృష్ణుడు అంటే నారాయణ స్వరూపుడు కానీ, అర్జునుడు వ్యాసుడు నారాయణ స్వరూపులు ఎలా అవుతారు, ఇది అబద్ధం అని మీకు అనిపించవచ్చు. ఇప్పుడు అందరికీ ప్రమాణాలు కావాలి, ప్రమాణం చూపించకపోతే మీరు నమ్మరు. ఇవన్నీ సైన్సు రోజులు కదా! ప్రమాణం కృష్ణుడే చూపించాలి. ఆయన ఏం చెప్పారంటే - పాండవులలో అర్జునుడిని నేను, వ్యాసుడిని కూడా నేనే అన్నారు. అంటే చెప్పినవాడు ఆయనే, విన్నవాడు ఆయనే, రాసినవాడు ఆయనే, అందుకే ఆ శాస్త్రానికి అంత గౌరవం వచ్చింది, అంత ప్రచారం వచ్చింది.

గాంధీగారు అన్నారు, మా అమ్మ చిన్నతనంలో చనిపోయింది,

అందుచేత మాకు మంచి చెడ్డలు చెప్పేవారు లేరు. నాకు ఏదైనా దుఃఖం వచ్చినా, బెంగ వచ్చినా, ఎవరైనా ఏవైనా మాటలు అన్నా, ఎవరితోను చెప్పకొనేవాడిని కాదు, భగవద్గీత చదువుకునే వాడిని, ఏదో ఒక శ్లోకం నన్ను ఊరుకోపెట్టేది. అందుచేత అమ్మ పోయినా, అమ్మలేని లోటు నాకు ఎప్పుడూ రాలేదు, ఆ లోటు భగవద్గీత తీర్చేసింది అని చెప్పారు గాంధీగారు.

ఇది కలియుగం. ఈ రోజులు మంచివి కాదు. మీకు కష్టం వస్తే ఎవరితో చెప్పకొంటారు? మీకు ఎవరికైనా కష్టాలు ఉంటే, ఎప్పుడూ కూడా సత్పురుషుడితోటి చెప్పకోండి. మీ కష్టాన్ని సత్పురుషుడితోటి చెప్పకుంటే, ఆ సత్పురుషుని హృదయంలోకి మీరు చెప్పిన మాట వెళ్ళితే సరిపోతుంది, అతనేమీ మీకు మహిమ చెయ్యక్కరలేదు.

మీరు 18 అధ్యాయాలు చదివేస్తారు అనుకోండి, మీకు పుణ్యం వస్తుంది కానీ జ్ఞానం రాదు. ఆ పుణ్యాన్ని మీరు మూట కట్టుకొని ఇతర లోకాలకి పట్టుకెళ్ళవచ్చు, మళ్ళీ జన్మకి కూడా పట్టుకెళ్ళవచ్చు. అయితే 18 అధ్యాయాలు మీరు చదువుకొని, అర్థం చేసుకొని, జీర్ణం చేసుకొంటే, మీకు జ్ఞానం వస్తుంది. మీరు జ్ఞానులు అవుతారు.

నేను మీకు హృదయం ఇస్తే, మీ హృదయం నాకు ఇస్తారు, నేను హృదయం ఇచ్చి మాట్లాడుతున్నాను అనుకోండి మీతోటి, మీరు కూడా నాకు హృదయం ఇస్తారు. నేను మీకు హృదయం ఇవ్వను అనుకోండి, కపటం మాటలు చెపుతాననుకోండి, మీరు ఎన్నాళ్ళు నమ్ముతారు? నాకు హృదయం ఇస్తారా? ఇవ్వాళ లేకపోతే రేపు అయినా నేను కపటం మాటలు మాట్లాడుతున్నాను అని మీకు అర్థం అయిపోతుంది కదా? తెలివైన వాళ్ళకైతే వెంటనే అర్థం అవుతుంది; డల్స్ అయితే ఇంకో 24 గంటలు ఆలస్యం అవుతుంది. అందరినీ మోసం చెయ్యటం కష్టం కదా! అయితే మనం భగవద్గీతకి ఎప్పుడైనా మన హృదయం ఇచ్చామా? ఎప్పుడైనా మన హృదయాన్ని తీసి శాస్త్రానికి ఇచ్చామా? మన హృదయం ఇవ్వకుండా శాస్త్రం మనకు ఇస్తుందా?

ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకోండి - గురుకృప, ఈశ్వర కృప, శాస్త్ర కృప లేకుండా ఎవరికీ జ్ఞానం రాదు. శాస్త్రాన్ని గౌరవించాలి, గురువుని గౌరవించాలి, ఈశ్వరుడిని గౌరవించాలి. అయితే ఈ భగవద్గీత చదవటం ఎందుకంటే, మన మనస్సుని నానబెట్టుకోవటం కోసం. మన మనస్సును భగవద్గీతా శాస్త్రంలో నానబెట్టాలి. నానబెడితే మనస్సుకి సంస్కారం ఏర్పడుతుంది. మనస్సు శుద్ధి అవుతుంది. మనస్సుకి ఏకాగ్రత

వస్తుంది. ఏ మార్గం నరకానికి తీసుకెళ్ళుతుందో మనస్సుకు స్పష్టంగా తెలుస్తుంది.

ఎంతసేపూ శరీరం అందాన్ని చూసుకొంటున్నాము. శరీరం అందంగా ఉందా లేదా చూసుకొంటున్నాము. మరి మనస్సు అందంగా ఉండక్కరలేదా? ఇంతమంది ఇక్కడ కూర్చున్నారు కదా- ఎంతమంది మనస్సులు అందంగా ఉన్నాయి? అందం లేని మనస్సు, గీతలో ఉన్న అందాన్ని ఎలా అందుకొంటుంది? చాలామంది మనుషులు కూరలో గరిటలాంటి వాళ్ళు. ఆ గరిట కూర ఉడికినంతసేపు కూరలోనే ఉంటుంది. కానీ రుచి ఎలా ఉంది అంటే, ఆ గరిటకి తెలియదు. అంటే మనుషులు అందరూ కూడా గరిటలు లాంటి వాళ్ళు. అసలు వారికి ఏమీ తెలియదు.

ప్రతి మనిషి, మీకు ఎన్ని దేహాలు ఉన్నాయి అంటే, అదేంటి కనిపించటం లేదా నాకు ఒకటే శరీరం ఉంది కదా అంటాడు. కానీ అది అబద్ధం. ప్రతి మనిషికి 2 శరీరాలు ఉంటాయి; 1. స్థూలశరీరం, 2. లోపల సూక్ష్మశరీరం అదే మనస్సు. మన అందరి శరీరాలు అమ్మ కడుపులోంచి వచ్చాయి. లోపల ఉన్న శరీరం మాత్రం అమ్మ కడుపులోంచి రాలేదు. అది మనం కూడా తెచ్చుకొన్నాము. మనం ఎంతసేపు స్థూల దృష్టికి అలవాటు పడిపోయాము, తెల్లనివి అన్నీ పాలు, నల్లనివి అన్నీ నీళ్ళు అనుకొనే మనుషులం మనం. కానీ చూసేది అంతా అబద్ధం వినేది అంతా అబద్ధం అని మీలో ఎంతమందికి తెలుస్తుంది? సూక్ష్మ శరీరాన్ని కూడా ఆడించేది ఆయనే. సుప్రీమ్ కంట్రోలర్ ఆయనే. దేవుడు మీలోనే ఆత్మగా ఉండి కంట్రోల్ చేస్తున్నాడు. మీరు చేసే పనులు అన్నీ చూస్తున్నాడు. వాడిని చూడటానికి మనకి నేర్పు ఉండాలి, ఓర్పు ఉండాలి, విశ్వాసం ఉండాలి. ఈ కళ్ళతోటి చూడలేం, ఈ చెవులతోటి వినలేం.

మనం అందరం ఒకటే పొరపాటు చేస్తున్నాం. ఈ శరీరం విషయంలో జాగ్రత్త పడుతున్నాం, ఎవరూ చెప్పక్కర్లేదు. లోపల శరీరం విషయంలో ఏమీ జాగ్రత్త పడటంలేదు. ఈ శరీరం స్మశానంలో దహనం అయిపోయిన తరువాత, మన కూడా వచ్చేది లోపల శరీరం. ఈ పుల్లలు దాన్ని కాల్చలేవు. మరి ఈ లోపల శరీరం విషయంలో అది ఎలా ఉంది అని చూసుకుంటున్నారా మీరు? మరి లోపల శరీరం మీకు అక్కరలేదా? లోపల శరీరాన్ని శుద్ధి చేసుకోవటానికే భగవద్గీత. లోపల శరీరం ఎవడికైతే బాగుందో, ఎవడైతే దీనిని సంస్కరించుకొంటున్నాడో, దానిలో వంకరలు ఎవడైతే తీసుకుంటున్నాడో, అందులో దుమ్ము ఎవడైతే దులుపుకొంటున్నాడో, వాడికి భగవద్గీత సహాయపడుతుంది. బట్ట మీద దుమ్ము

పడితే దులిపేసుకొంటున్నాం, అలా మనస్సులో దుమ్ము దులుపుకోవటానికే భగవద్గీత. భగవద్గీత యొక్క గొప్పతనం చెపుతాను. ఒక్కొక్క మనిషికి ఒక్కో దుర్గుణం ఉండవచ్చు - కొంతమందికి రాగద్వేషాలు, కొంతమందికి కామక్రోధాలు, కొందరికి అసహనం, కొందరికి లోభిత్వం, కొందరికి అసూయ ఉండవచ్చు. మొత్తం మీద ఏ దుర్గుణం ఉన్నప్పటికీ అది అనారోగ్యమే. కానీ ఇవి అన్నీ అజ్ఞానంలోంచి వస్తున్నాయి. అజ్ఞానం కాన్సర్ జబ్బు లాంటిది, కాన్సర్ ఉంటే చాలు కదా, మిగతా రోగాలు అక్కరలేదు! కాన్సర్ శరీరాన్నే తీసుకొనిపోతుంది. శరీరానికి ఎన్ని రోగాలు ఉన్నా పర్వాలేదు. శరీరం స్మశానంలో కాలిపోయినప్పుడు, ఈ రోగాలన్నీ కాలిపోతాయి. చచ్చిపోయిన మనిషికి కడుపునొప్పి ఏమిటండీ? ఒకవేళ నిజంగా కడుపునొప్పి ఉన్నా అది కాలిపోతుంది కదా స్మశానంలో? అయితే ఈ లోపల శరీరం ఉంది చూసారూ, దానికి ఉన్న రోగాన్ని మట్టుకు ఈ పుల్లలు తగలబెట్టలేవు. అది మట్టుకు స్మశానంలో పోదు. అది మన కూడా వచ్చేస్తుంది. దానిని కడుక్కోవటానికే, వాటిల్ని జాగ్రత్తగా తొలగించుకోవటానికే భగవద్గీత. మీలో ఏ రకమైన లోపం ఉన్నప్పటికీ, మీలో ఫలానా లోపం ఉంది, దానిని ఈ విధంగా తీసుకోవాలి అని మార్గం చూపించేది భగవద్గీత. భగవద్గీత ఎటువంటిది అంటే, ప్రపంచంలో ఉన్న మంచివాళ్ళని అందరినీ తీసుకొచ్చి, ఆ మంచివాళ్ళ మనస్సులు అన్నీ ఒకచోట పోగుపెడితే, ఆ మంచి ఎలా ఉంటుందో, అటువంటి మంచి అంతా భగవద్గీతలో ఉంది. ఇది మోక్ష గ్రంథం.

మీ శరీరంలో చాలా అవయవాలు ఉన్నాయి. మీకు చెవిపోటుగా ఉంటే, చేతులు లాగుతుంటే, మీ చెవులు చేతులు ఏడవవు. మీ కళ్ళు ఏడుస్తాయి. మీ శరీరంలో ఏ అవయవానికి నొప్పి వచ్చినా మీ కళ్ళు ఏడుస్తాయి. అదేవిధంగా సమాజంలో ఎవడికి ఏ కష్టం వచ్చినప్పటికీ సత్పురుషుడు బాధపడతాడు. వాడు సత్పురుషుడు అంటే! భగవంతుడు మీ హృదయంలో ఉన్నాడు, అయితే మీకు అనుభవంలో లేడు. మీరు తెలుసుకోలేకపోతున్నారు. అందుకే దానికి సంబంధించిన సుఖం మీకు తెలియటంలేదు. ఎవ్వరూ మహిమల గొడవలలోకి వెళ్ళకండి. ఎక్కడ చూసినా ఇదే గొడవ, వాటి వలన మీరు ఆత్మకి దూరం అయిపోతారు. జ్ఞానానికి దురం అయిపోతారు. మీ దగ్గర నుంచి నేను కీర్తి ఆశించటంలేదు. తమిళనాడులో జ్యోతిరామలింగస్వామి అని ఒకాయన ఉండేవారు. నిజంగా జరిగిన సంఘటన మీకు చెపుతున్నాను. ఆయన ఎప్పుడూ ఆత్మ గురించి చెప్పేవారు. ఏ గ్రామంలో అయితే ఉండేవారో, ఆ గ్రామంలో ఆలయం యొక్క తెర హారతి ఇస్తూ వుంటే అంటుకుంది. జ్యోతి రామలింగస్వామి వేరేచోట కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నారు, ఆ తెర

అంటుకున్నట్టు ఆయనకి తెలిసింది. ఎవరో అక్కడ తలపాగా పెట్టుకున్నారు. ఆ తలపాగా గబుక్కున చేతిలోకి లాక్కొని నలిపేసారు. అక్కడ గుడిలో మంట ఆరిపోయింది. ఈయన జ్ఞాన నేత్రానికి కనిపించింది. తలపాగా నలిపేసరికి మంట ఆరిపోయింది. జ్యోతి రామలింగస్వామి ఇలా జరిగిందని ఏమీ చెప్పలేదు. రెండు రోజులకి మొత్తంమీద ఎలాగైతేనేం జ్యోతి రామలింగస్వామి తలపాగా నలపటం వల్ల మంట ఆరిపోయింది అని తెలిసింది. ఈ మహిమ జరిగిన తరువాత అందరూ ఆయన దగ్గరకి మహిమల కోసమే వచ్చేవారు కానీ ఆత్మ గురించి చెపుతూ వుంటే ఎవరూ వినేవారు కాదట. అప్పుడు జ్యోతి రామలింగస్వామి ఒక మాట అన్నారట - అసలు ఎంత ముఖ్యమైన అవసరం అయినా సరే మహిమలు చేయకూడదు అన్నారట. ఎందుకంటే మహిమలు అబద్ధం, ఆత్మ నిజం. ఆత్మ గురించి ఎవరూ వినటం లేదు.

ఎవరు మహిమలు చేసినా రెండు పనుల కోసం చేస్తారు - కీర్తికోసం, ధనంకోసం. సిద్ధులు, శుద్ధులు అని రెండు రకాలు ఉన్నారు. పూర్వం ఒక పరమపవిత్రుడు ఉండేవాడు. అతడు భగవంతుని ప్రార్ధన చేసుకొనేవాడు. కానీ భగవంతుడ్ని ఏమీ అడిగేవాడు కాదు. ఏమీ అడగకుండా ప్రార్ధన చేస్తున్నావు, నీకు ఏమి కావాలి అంటే, నాకు ఏమీ అక్కరలేదు అన్నాడు. శరీరానికి స్నానం ఎటువంటిదో, మనస్సుకి ప్రార్ధన అటువంటిది శరీరం మీద ఉన్న దుమ్ము నీళ్ళతో ఎలా అయితే పోగొట్టుకొంటామో, అలాగే ప్రార్ధనతో మన మనస్సులో ఉన్న ధూళి అంతా రాలిపోతుంది. నీ ప్రార్ధనకి బహుమతి ఇవ్వటానికి వచ్చానని భగవంతుడు అంటే, నేను బహుమతుల కోసం ప్రార్ధన చేయటంలేదు, నాకు ఏమీ వద్దు అన్నాడు. ధనం ఇస్తాను అంటే నేను డబ్బుని కాపలా కాయలేను అన్నాడు అయితే భవిష్యత్తులో ఏమి జరుగుతుందో చెప్పే శక్తిని, నీ ప్రార్ధనకి నీ భక్తికి బహుమతిగా ఇస్తాను అంటే, భవిష్యత్తే లేని వాడికి భవిష్యత్తు గొడవ నాకెందుకు అన్నాడు. నాకు నిన్నటి తలంపు లేదు. రేపటి గురించి ఆలోచన లేదు, రేపే లేని నాకు, భవిష్యత్తుగురించి చెప్పే జ్ఞానం ఎందుకు, అక్కరలేదు అన్నాడు. పోనీ ఎదుటివాడి మనస్సు చూసి చెప్పే శక్తి నీకు ప్రసాదిస్తాను అన్నాడు భగవంతుడు. నా మనస్సులో ఏమి జరుగుతోందో చూసుకొనే శక్తి నాకు లేదు. ఇంక ఎదుటి వారి మనస్సులో ఉన్నది నాకు ఎందుకు అన్నాడు. నా మనస్సే అంతర్ముఖం కాలేదు, ఇంక ఎదుటి వారి మనస్సులో ఏముందో చూసే శక్తి నాకెందుకయ్యా, అదీ అక్కరలేదు. అయితే పాపం దేవతలు ఏదోటి ఇవ్వాలని ఎంతో ప్రేమతో వచ్చారు. రోగం తగ్గించే శక్తిని ఇస్తాము, ఎవరికి ఏ రోగం ఉన్నా సరే, నిన్ను చూస్తే ఆ రోగం తగ్గిపోతుంది అన్నారు. భగవంతుడి నామం

చేసుకొంటే చాలు రోగం తగ్గుతుంది. భగవంతుని నామం ఉండగా, ప్రత్యేకంగా మీరు ఇవ్వటం ఎందుకు? అందుచేత అదీ నాకు అక్కరలేదు. దేవతలు అందరూ వాడి మీద ప్రేమతో ఒక తీర్మానం చేసుకొని, వాడి నీడ ఎవరి మీద పడితే వారి కోరికలు అన్నీ నెరవేరతాయి అని ఆ శక్తిని ఇచ్చారు. ఇది వాడికి తెలియదు. ఏది అడిగినా వద్దు అన్నాడు కదా! దేవతల ఆప్యాయత చూడండి. మనిషి కూడా నీడ వుంటుంది కదా! ఆ నీడ ఎవరిమీద పడితే వారి కోరికలు అన్నీ నెరవేరతాయి అని ఒక బహుమానంగా, ఈశ్వర ప్రసాదంగా వాడికి ఇచ్చేసి వెళ్ళిపోయారు దేవతలు. వాళ్ళు వెళ్ళిపోయారు కదా! ఇక మనని వేధించటం లేదు, ప్రశ్నలు అడగటం మానేశారు అనుకొన్నాడు ఈ భక్తుడు. వీడి నీడ ఎవరి మీదైతే పడుతోందో, వారి రోగం తగ్గుతోంది, మనస్సులో కష్టం పోతోంది, ఏ కోరిక కావాలంటే ఆ కోరిక నెరవేరుతోంది. కానీ వీడికి తెలియదు. మీ నీడ మామీద పడితే, మాకు ఎన్నో మహిమలు జరుగుతున్నాయి, మాకు ఎంతో శాంతిగా ఉంటోంది, మేము అనుకొన్న కోరికలు నెరవేరిపోతున్నాయి అని చెప్తే, నాకు ఏమీ తెలియదు అన్నాడు. వాడికి నిజంగా ఏమీ తెలియదు. వాడు సిద్ధుడు కాదు శుద్ధుడు. అదే మీరు ఇక్కడ గ్రహించాలి. రెండు రకాలు - సిద్ధులు, శుద్ధులు. సిద్ధులు కీర్తి కోసం ధనం కోసం చెయ్యాలని చేస్తారు. శుద్ధుడి వల్ల కూడా సిద్ధులు జరుగుతాయి. సిద్ధుడికి నేను చేస్తున్నాను అని తెలుస్తుంది. శుద్ధుడికి తన వల్ల సిద్ధులు జరుగుతున్నాయి అని తెలియనే తెలియదు. వాడు శుద్ధుడు.

రమణ మహర్షిగారికి సిద్ధులు ఉన్నాయి కానీ ఆయన శుద్ధుడు. ఎవరన్నా స్వామీ ఇవాళ ఇలా జరిగింది అంటే ఏమో నాకు తెలియదే అనేవారు. నిజంగానే తెలియదు. ఆ హృదయం యొక్క లోతు విశాలత్వం కనుక మీకు వస్తే, దాని వల్ల లోకం అంతా మీ ద్వారా ఉద్ధరింపబడుతుంది. కొంతమందికి చేతులనిండా పని ఉండాలి. ఆ స్వభావం పూర్వ జన్మలనుంచీ అలా వస్తుంది. వాళ్ళకి కర్మయోగం చెప్పాడు భగవంతుడు. కొంతమంది ఉంటారు, వాళ్ళకి మాట్లాడితే ఆవేశం వచ్చేస్తూ ఉంటుంది, చిన్నమాట అంటే చాలు ఆవేశం వచ్చేస్తుంది - ఎమోషనల్ టైపు. వాళ్ళకి ఎంతసేపు పొగడ్తలు కావాలి, ఆలోచన తక్కువ, ఆవేశం ఎక్కువ. వాళ్ళకి భక్తి యోగం చెప్పాడు, కొంతమంది మాకు రీజన్ కావాలి అంటారు. మాట్లాడితే క్రమం కావాలి, రీజన్ లేకుండా మాట్లాడకండి, ఒక క్రమంగా మాట్లాడండి, హేతువు చెప్పండి అంటారు. వాళ్ళకి జ్ఞాన యోగం చెప్పాడు. ఎంత దయామయుడో చూడండి. ఇన్ని రకాల మనుషులు ఉన్నారు అని మన కళ్ళతోటే చూస్తున్నాము కదా! వీళ్ళ కోసమే ఈ యోగాలు అన్నీ చెప్పాడు. అందుకే భక్తి యోగం చెప్పాడు, కర్మయోగం చెప్పాడు,

జ్ఞాన యోగం చెప్పాడు. ఆయనకోసం కాదు, మన కోసం యోగాలు అన్నీ చెప్పాడు. భక్తియోగం ద్వారా వెళ్ళేవాడూ తనలో ఆత్మని దర్శించాలి, కర్మయోగం ద్వారా వెళ్ళేవాడూ తనలో ఆత్మని దర్శించాలి, జ్ఞానయోగం ద్వారా వెళ్ళేవాడూ తనలో ఆత్మని దర్శించాలి, మొత్తానికి గమ్యం మట్టుకు ఆత్మే.

భక్తి ఎలా ఉండాలి అంటే, ఈ మధ్య ఒక అబ్బాయి నా దగ్గరకు వచ్చాడు, ఆ అబ్బాయిని గురువుగా పెట్టుకొన్నాను. ఆ అబ్బాయికి లెక్కలలో 96 మార్కులు వచ్చాయి, ఫస్ట్ మార్కు ఎవరిదంటే, నాదే అని ఏడవటం మొదలుపెట్టాడు, ఏంటి కళ్ళనీళ్ళు పెట్టుకొంటున్నావు అంటే, నాకు 100కి నాలుగు మార్కులు తగ్గిపోయాయి అని చెప్పి ఏడుస్తున్నాడు. సెకండ్ మార్కు ఎంతవస్తే నాకెందుకు, నాకు తగ్గిపోయాయి కదా 100కి నాలుగు మార్కులు అని ఏడుస్తున్నాడు. వాడు నాకు గురువు! మన భక్తి అలా ఉండాలి. వాడు మనకి గురువే. అంత చిన్న వయస్సులో అంత గొప్ప భావన ఎలా వచ్చిందో, ఆ బుర్రలో ఎలా తట్టిందో అని నాకు ఆశ్చర్యం వేసింది. మీకు ఎంతోమంది స్నేహితులు ఉన్నారు, ఎంతోమంది బంధువులు ఉన్నారు, కానీ మరణించే రోజులో ఒక్క స్నేహితుడు కానీ ఒక్క బంధువు కానీ వస్తాడా మనతో? అయ్యోపాపం అని కనీసం రెండు కన్నీటి చుక్కలు అయినా కారుస్తారా? ఇవి అన్నీ అబద్ధాలు అని చెపుతున్నాను. అన్ని సంబంధాలు అబద్ధమే, అదేవిధంగా భగవంతుడితో సంబంధం కూడా అబద్ధమే. మీరు కంగారుపడకండి. అహంకారానికే స్నేహితులు, అహంకారానికే బంధువులు, అహంకారానికే సంసారం, అహంకారానికే తల్లితండ్రి అత్తగారు మావగారు ఇవన్నీ. అహంకారానికే ప్రపంచం, చివరికి దేవుడు కూడా అహంకారానికే! ఇంకో వంద సంవత్సరాలకైనా లేకపోతే రాబోయే జన్మల్లో ఎప్పుడైనా నేను చెప్పిన మాటలు మీకు గుర్తు ఉంటే, ఫలానా గీతాజయంతి రోజున నాన్నగారు ఇలా చెప్పారు అని ఎప్పుడైనా మీరు తలుస్తారని చెపుతున్నాను. దేవుడు అహంకారానికే, ప్రపంచం అహంకారానికే, సంసారం అహంకారానికే.

ఏనాటికైనా ఈ ఒక్క విషయం మీరు అర్థం చేసుకోవాలి. మనం నమ్మే విషయాలు అన్నీ నిజం కాదు. నిజాన్ని మనం నమ్మాలి. అది నేర్చుకోవాలి మనం. నా నుండి నిన్ను దూరం చేసేది కూడా అహంకారమే. అది నీ లోపం కాదు, నాలో పవిత్రత చాలదు. ఈ లోపం ఎవరి లోపం కాదు, నాలో పవిత్రత ఇంకా చాలదు. ఏ దేవుడిని ఆరాధించినా, నీ మనస్సు పూర్తిగా అణగాలి. చచ్చిపోయిన తరువాత ఎక్కడికి వెళ్తాం? ఏదో మంచి లోకాలు వస్తాయి అనుకొంటాం. మంచి లోకాలు చెడ్డలోకాలు కూడా నిజం కాదు.

మీరు అందరూ గాలి పీల్చుకొంటున్నారు, గాలి విడిచిపెడుతున్నారు. మరి గాలి పీల్చుకోవటం, గాలి విడిచిపెట్టడం మన చేతిలో ఉందనుకోండి, అసలు చావేరాదు కదా మనకి? లోపల కంట్రోలర్ ఉన్నాడు! పాపం చచ్చిపోయే వాడు కష్టపడ్డా గాలి పీల్చుకోలేడు. ఆఖరి శ్వాస సరిగ్గా ఖర్చు అయ్యేటప్పటికి ఇంకోసారి గాలి పీల్చుకొందామని వీడికి ఉన్నా-స్టాప్ - అక్కడికి ఆపు చేసేస్తాడు. ఇంకో శ్వాస తీసుకొందామని వీడు తిప్పలు పడుతూ వుంటాడు పాపం. కానీ రాదు కదా ఇంక అది. కంట్రోలర్ లోపల ఉన్నాడు. మనం గాలి పీల్చేసుకొంటున్నాం అనుకొంటున్నాం. మనం ఎవరం గాలి పీల్చుకోవటానికి? మీరు దేన్ని చూసుకొని గర్వపడుతున్నారు? నేను లోపల గర్వం దాచుకొన్నాను, కానీ తెలివైనవాడిని కాబట్టి బయటికి కనపడనివ్వటం లేదు. జాగ్రత్తగా తెలివితో వాటిని కవర్ చేస్తున్నాను. మీ కళ్ళకి కనబడకుండా దానికి గుడ్డ వేసి జాగ్రత్తగా ఆ గర్వాన్ని లోపల దాచుకొంటున్నాను. ఆ గర్వాన్ని జాగ్రత్తగా లోపల దాచుకొని, నేను భగవద్గీత చదివితే నాకు అర్థం అవుతుందా? లోపల అహంకారాన్ని, గర్వాన్ని దాచుకొని ఈ 18 అధ్యాయాలు రోజూ నువ్వు మరణించే వరకూ చదివినా మీకు భగవద్గీత తెలియదు. తెలియనే తెలియదు.

త్యాగం అంటే ఏమిటి? తనలో ఉన్న రాగద్వేషాలను విడిచిపెట్టిన వాడే నిజమైన త్యాగి. ఈ రాగద్వేషాల గురించే సంసారం వస్తోంది. ఈ రాగద్వేషాల గురించే లోకం వస్తోంది. ఈ రాగద్వేషాల గురించే శరీరం వస్తోంది. ఎవడు నిజమైన త్యాగి అంటే, ఎవడైతే తన రాగద్వేషాలను విడిచిపెడ్తున్నాడో, పరిత్యజిస్తున్నాడో, వాడే నిజమైన త్యాగి.

సోదరమహాశయులారా! జ్ఞాని యొక్క గొప్పతనం మీకు పుస్తకాలలో కనబడదు. మీరు బైబిల్ చదవండి, భగవద్గీత చదవండి, ఉపనిషత్తులు చదవండి, లోకంలో ఎన్ని శాస్త్రాలు ఉంటే అన్ని శాస్త్రాలూ చదవండి, ప్రింట్ అయిన ప్రతీ అక్షరం చదవండి; కానీ జ్ఞాని యొక్క గొప్పతనం జ్ఞానం యొక్క గొప్పతనం మీరు జ్ఞానిలో చూడాలి కానీ, పుస్తకాలలో కనబడదు. జ్ఞాని యొక్క గొప్పతనం ఎంతో, జ్ఞాని యొక్క విలువ ఎంతో, జ్ఞాని ముఖంలో చూడవలసిందే కానీ పుస్తకంలో మట్టుకు కనబడదు. జ్ఞానం లేని వాడికి, త్యాగం లేని వాడికి ఆత్మ దర్శనం ఇవ్వదు. "రాజ విద్యా రాజ గుహ్యం, పవిత్రం ఇదం ఉత్తమం; ప్రత్యక్షావగమం ధర్మ్యం, సుసుఖం కర్తుం అవ్యయం" - ఈ శ్లోకంలోకి వెళ్ళాలి మనం. నేను గీతా పారాయణం పూర్తిగా చేసింది ఒక్క రోజు కూడా లేదు. ఏ శ్లోకం చదివితే ఆ శ్లోకమే ఆపుచేసేస్తుంది. నన్ను విడిచిపెట్టేసి ఎందుకు వెళ్ళిపోతున్నావు అని ఆ శ్లోకం నా వంక చూసినట్టు అనిపిస్తుంది. నన్ను గ్రహించావా? నేను చెప్పే విషయం నువ్వు విన్నావా?

నన్ను విడిచిపెట్టేసి ఇంకో శ్లోకం దగ్గరికి వెళ్ళిపోతున్నావు అని ఆ శ్లోకం నావంక చూసినట్టు అనిపిస్తుంది. అన్ని విద్యలూ ఉన్నాయి, కానీ ఇది రాజ విద్య అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. కెమిస్ట్రీ, ఫిజిక్స్, లెక్కలు, ఇంజనీరింగ్ కోర్సు, డాక్టర్ కోర్సు ఇలా అనేక విద్యలు ఉన్నాయి లోకంలో. కానీ ఆత్మవిద్య, బ్రహ్మవిద్య, రాజు అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. రాజు అంటే శ్రేష్ఠమైనది ఉత్కృష్టమైనది, అన్ని విద్యల కంటే గొప్పది. ఇందులో గొప్ప ఏముందండీ అని మీరు అడగవచ్చు, ఒక్క బ్రహ్మ విద్య తప్పించి మిగతా అన్ని విద్యలూ కూడా సంసారాన్ని పెంచుతాయి అంతే. మీరు ఎన్నో విద్యలు నేర్చుకోండి, అమెరికా, రష్యా వెళ్లి నేర్చుకోండి, ఒక్క బ్రహ్మవిద్య తప్పించి మిగతా అన్ని విద్యలూ సంసారానికి పనికివస్తాయి. ఆ జన్మకాజన్మ సంసారాన్ని పెంచుతాయి! అంటే మిగతా విద్యలు బలం కాదు, వాపు! బోదకాలు ఉన్నవాడు నేను చాలా బలంగా ఉన్నాను అనుకొంటాడా?

ఒక రహస్యం చెపుతున్నాడు వాసుదేవుడు. ఈ ఆత్మ, రమణ మహర్షికి రహస్యమా, కృష్ణుడికి రహస్యమా, లేకపోతే రాముడికి రహస్యమా? అంటే తెలియని వాడికి రహస్యం! అయితే ఇది రహస్యం అని చెప్పటంలో భగవంతుని ఉద్దేశం ఏమిటంటే, ఇది చాలా లోతైన విద్య, చాలా గంభీరమైన విద్య, అద్భుతమైన విద్య, అపూర్వమైన విద్య, చాలా ఉదాత్తమైన విద్య! కొన్ని చెరువులు చాలా పెద్దవే కానీ దిగితే అసలు కాళ్ళు కూడా తడవవు. మోకాళ్ళ లోతు కూడా ఉండవు. కొన్ని చెరువులు చాలా చిన్నవి కానీ లోతు, మనిషి మునిగిపోతాడు. అలాగే కొంతమంది మనస్సులు కొంచెం విశాలంగా ఉంటాయి కానీ లోతు అసలు ఉండదు. కొంతమంది మనస్సులు కొంచెం లోతు ఉంటాయి కానీ విశాలత్వం అసలు ఉండదు. ఈ బ్రహ్మవిద్య కావాలంటే లోతూ ఉండాలి విశాలత్వం ఉండాలి. హృదయం విశాలంగా ఉండాలి లోతుగా ఉండాలి, వాడిని జ్ఞానం వరిస్తుంది.

చెడ్డవాడు చెడ్డ పనులు చేస్తాడు. ఏంటి ఇన్ని చెడ్డ పనులు చేస్తున్నాడు అని అనుకొంటాం మనం. వాడు సహజంగానే చేస్తాడు. వాడికి రాత్రి శుభ్రంగా నిద్రపడుతుంది. ఒక మనిషిని చంపేసి వచ్చి రాత్రి పడుకుంటే శుభ్రంగా నిద్రపడుతుంది. మంచివాడు చేసే పని వాడు సహజంగానే చేస్తాడు. చెడ్డవాడు చేసే పని వాడూ సహజంగానే చేస్తాడు. మనం జీవితంలో సహజంగా జీవించటం సహజంగా మాట్లాడటం నేర్చుకోవాలి. ఒక అమ్మగారు ప్రొద్దున్నే వచ్చి, రాత్రి మీరు నాకు స్వప్నంలో వచ్చారు, నిన్న సాయంత్రం వరకూ ఉన్న అనారోగ్యం పోయింది అందుకని ప్రొద్దున్నే మిమ్మల్ని చూడటానికి జిన్నూరు వచ్చాను

అన్నారు. అది అబద్ధం. ఆవిడలో ఉన్న ఆత్మే, ఈశ్వరుడే, ఆవిడలో ఉన్న కంట్రోలర్, ఆవిడకి అది చేసాడు. నా రూపాన్ని అక్కడ చూపించాడు, నా రూపానికి అక్కడ గౌరవం అంతకంటే ఏమీ లేదు. లేకపోతే నా కాళ్ళు చేతులు ఆవిడ రోగాన్ని తగ్గించాయా? అది అబద్ధం! ఆవిడలో ఉన్న ఆత్మే ఊరికే ఈ రూపాన్ని చూపించింది అంతే! కానీ తగ్గించింది ఆవిడలో ఉన్న ఈశ్వరుడు.

"రాజవిద్యా రాజగుహ్యం, పవిత్రం ఇదం ఉత్తమం...." ఈ బ్రహ్మవిద్యని ఎవడైతే నేర్చుకొంటున్నాడో, అలవాటు చేసుకొని, శ్రవణం మననం చేసి, దైనందిన జీవితంలో ఎవరైతే ఆచరిస్తున్నాడో, వాడిని పవిత్రం చేస్తుంది ఇది. మీలో లోపాలు బలహీనతలు ఏవి ఉన్నప్పటికీ, ఈ బ్రహ్మవిద్యని కనుక మీరు శ్రవణం చేస్తూ ఉంటే, మీ లోపాలని పోగొడుతుంది. బ్రహ్మవిద్య తప్పించి ప్రపంచంలో మిగతా ఎన్ని విద్యలు ఉన్నప్పటికీ, వాటిలో ఏ విద్యా మిమ్మల్ని పవిత్రుడిని చెయ్యదు. అవి పొట్ట పోషిస్తాయి అంతే!!

"........... ప్రత్యక్షావగమం ధర్మం, సుసుఖం కర్తుం అవ్యయం" ఈ బ్రహ్మ విద్య పవిత్రుడిని చెయ్యటమే కాదు, సాక్షాత్తుగా ఫలితాన్ని ఇప్పుడే ఇక్కడే, ఇక్కడ కూర్చుని ఉండగానే, ఈ నిమిషంలో మీకు ఫలితాన్ని ఇస్తుందట. అదీ రహస్యం!

మీరు లక్ష వత్తుల నోము నోచుకోండి వచ్చే జన్మలో పుణ్యం వస్తుంది. లేకపోతే రోజు జపం చేసుకోండి మళ్ళీ జన్మ మంచి జన్మ వస్తుంది, లేకపోతే ఎక్కువగా దానధర్మాలు చేసుకోండి వచ్చే జన్మలో మంచి లోకం వస్తుంది, గొప్ప గొప్ప శరీరాలు వస్తాయి, మీకు ఎంతో గౌరవం వస్తుంది, కీర్తి వస్తుంది, మీరు విద్యావంతులు అవుతారు, ధనవంతులు అవుతారు, అదృష్టవంతులు అవుతారు, ఇలా ఎన్నో రకాలు వేదాలలో చెప్పారు, ఉపనిషత్తులలో చెప్పారు, బైబిల్లో చెప్పారు. మరి వాసుదేవస్వామి ఇలా చెప్పటం లేదు ఏమిటి? "....ప్రత్యక్ష ఆవగమం...." ఇప్పుడే ఇక్కడే సాక్షాత్తుగా ఆత్మ మీకు దర్శనం ఇస్తుంది. ఆత్మ మీకు దర్శనం అవుతుంది. మీరు మరణించిన తరువాత కాదు, వాయిదాలు లేవు. ఏప్రిల్ నెలలో రండి, వచ్చే సంవత్సరం రండి, ఇవేమీ లేవు. ఇప్పుడే ఇక్కడే, తక్షణం, నీకు వెంటనే అప్పటికప్పుడు సాక్షాత్తుగా ఫలితాన్ని ఇచ్చేది ఈ బ్రహ్మవిద్య అని భగవంతుడు చెపుతున్నాడు. ఇది నేను కల్పించి చెపుతున్నానా? ".....ప్రత్యక్ష ఆవగమం...." అంటే సాక్షాత్తుగా ఫలితాన్ని ఇచ్చేది. సాక్షాత్తుగా ఇక్కడే మీకు దర్శనం ఇస్తుంది. అంటే నిజంగా బ్రహ్మవిద్యే కనుక నీకు చెప్పేవాడు సరైన వాడు నీకు దొరికితే, నీకు అప్పటికప్పుడు ఆత్మ దర్శనం అవుతుంది; ఆ సెకండ్‌లో ఆత్మ దర్శనం అవుతుంది. అంటే నీకు ఆత్మ విద్య చెప్పినప్పటికీ, శ్రవణ మాత్రంచేత నీకు ఆత్మ

దర్శనం అవ్వకపోతే చెప్పేవాడిది లోటు!

"......ప్రత్యక్ష ఆవగమం...." వాయిదాలు లేవు. ఈ బ్రహ్మవిద్య వల్ల, ఆత్మవిద్య వల్ల, ఈ మోక్షవిద్య వల్ల, నీకు ఆ జన్మలోనే ఆ లోకంలోనే, ఆ దేహంలో ఉండగానే నీకు సాక్షాత్తుగా ఆత్మ దర్శనం అవుతుంది. ఏమీ వాయిదాలు లేవు, ఇంకో గంట, ఇంకో నిముషం ఏమీ లేవు. రేపు అనేది లేదు. రేపుకి రూపు లేదు, రేపు అన్న సమస్య లేదు. ఈ బ్రహ్మవిద్య ఎటువంటిదంటే, నీకు అప్పటికప్పుడు సాక్షాత్తుగా ఫలితాన్ని ఇస్తుంది.

మీకు శాస్త్రం వినాలని లేదా? మా ఊరిలో ఎవరూ వినరండీ, అందుచేత మేమూ ఇటువంటి విషయాలు వినటానికి రామండీ అంటారు. అంటే మీ ఊళ్ళో అందరికీ రోగాలు ఉంటే మీరూ రోగాన్ని కోరుకొంటారా? మీ ఊళ్ళో అందరికీ రోగాలు ఉన్నాయి అనుకోండి? అటువంటి రోగం నాకూ వస్తే బాగుండును అనుకొంటారా? ఊళ్ళోవాళ్ళు రాము అంటున్నారని చెప్పి మేమూ రాము, మేమూ వినము అనటం ఏమిటండీ? ఇవి అన్నీ సాకులు, మన మనస్సు దొంగ, అది ఎంతసేపూ ఏవో సాకులు వెదుకుతూ ఉంటుంది. ఎలా తప్పించు కొందాం అని ఆత్మను మటుకు చేరకున్నా లోకాలు కావాలి, దేవుళ్ళుకావాలి. పుణ్యాలు కావాలి, అంటూ ఆత్మ దగ్గరికి వెళ్ళదు అది. ఆత్మ దగ్గరికి వెళ్ళితే అది ఏమైపోతుందో అని మనస్సుకి భయం. దీనికి అన్నీ కావాలి, లోకంలో, ఊళ్ళో ఇంటిలో ఏమి జరుగుతుందో అన్నీ కావాలి. ఆత్మ దగ్గరికి మట్టుకు వెళ్ళదు మనస్సు. ఎందుచేతనంటే ఆత్మదగ్గరికి వెళ్ళితే దాని అస్తిత్వం పడిపోతుందేమోనని దానికి భయం. దాని పెత్తందారీతనం పోతుంది అని.

కొంతమంది ఏమంటారంటే మీ భగవాను నేను ఎవడినో తెలుసుకోమంటాడు ఏమిటండీ. నేను నేను అంటే మాకు భయం వేస్తోంది అంటారు. ఈ నేనుని వదిలేసి మీరు భగవంతుడికోసం వెదికితే, కోటి జన్మలు ఎత్తినా మీకు భగవంతుడి దర్శనం అవ్వదు. నామాట నమ్మండి. కోటిజన్మలు వెదికినా భగవంతుడు ఎవడో మీకు తెలియదు. రమణమహర్షిగారు చెప్పిన ఈ నేనుని వదిలేసి భగవంతుడు ఎక్కడ ఉన్నాడు అని వెదకటం మొదలుపెడతారు అనుకోండి. మీరు కోటి జన్మలు ఎత్తినా, కోటిలోకాలు తిరిగినా, భగవంతుడు ఎవడో మీకు తెలియదు. శాంతిలేని వాడికి సుఖం ఎక్కడిది? మీకు ఇంట్లో అన్నీ ఉన్నాయి. మీకు శాంతిలేదు. ఏం సుఖం అనుభవిస్తారు మీరు? భగవంతుడు మనం కూడా ఆత్మే అని చెపుతున్నాడు. అది మనం మరచిపోయాము.

నేను ఈ శరీరాన్ని అని, ఊరు అని, దేశం అని, ఇలా పరిమితులు పెట్టుకొన్నాం.

ఆత్మ విద్య ధర్మ విరుద్ధంగా ఉండదు. అది ధర్మ స్వరూపమే. ఈ లోకంలో ఉన్న పాపాన్ని తగ్గించటం కోసం నేను అవతరిస్తూ ఉంటాను, ధర్మాన్ని స్థాపించటంకోసం నేను అవతరిస్తూ ఉంటాను. అంటే భగవంతుడు వేరు, ధర్మం వేరు కాదు, భగవంతుడి స్వరూపమే ధర్మం. ఎవడిలోనైనా పాపం ఉందనుకోండి, వాడిని శిక్షించటానికి భగవంతుడు ఉన్నాడు. మీరు ఎందుకు వాడిని ద్వేషిస్తారు? భగవంతుడు చేసే పని మీరు చేస్తారా? దుష్టులను శిక్షించటానికి, శిష్టులను రక్షించటానికి నేను ఈ లోకంలో అవతరిస్తున్నాను అని కృష్ణుడు చెప్పాడు కదా! భగవంతుడు ఆ పని చూసుకుంటాడు కదా! మరి మీకెందుకు? ఎవడో ఒకడు దుర్మార్గుడు ఉంటాడు అనుకోండి, వాడు దుర్మార్గుడు అనుకోవటం ఎందుకు? వాడిని భగవంతుడు శిక్షిస్తాడు. ఈ లోపల మీరు కంగారు పడిపోతున్నారు ఏంటి? భగవంతుడికి తెలియదా దుర్మార్గుడు అక్కడ ఉన్నాడని, ఈ లోపల మీకు కంగారు ఎందుకు?

అన్ని విద్యలలోకి బ్రహ్మవిద్య చాలా కష్టం అని మన తలంపు. అన్ని విద్యలలోకి కష్టమైనది బ్రహ్మవిద్య అని మన ఊహ, మన ఆలోచన. ఇక్కడ భగవంతుడు దానికి విరుద్ధంగా చెపుతున్నాడు - "....సుసుఖం...." చాలా తేలికగా దీనిని ఆచరించవచ్చు. ఈ బ్రహ్మవిద్యని చాలా తేలికగా ఆచరించవచ్చు అని భగవంతుడు చెపుతున్నాడా, నేను కల్పించి చెపుతున్నానా మీకు? మీ వ్రతాల వల్ల, మీ పుణ్యాల వల్ల, మీ దానాల వల్ల, మీ ధర్మాల వల్ల, వీటన్నిటి వల్ల వచ్చే ఫలితం నాశనం అవుతుంది. కానీ ఈ ఆత్మ విద్యవల్ల వచ్చే ఫలితం నాశనం కాదు! దీనికి నాశనం లేదు, ఈ బ్రహ్మవిద్య వల్ల వచ్చే ఫలితం, ఈ ఆత్మవిద్య వల్ల వచ్చే ఫలితం, ఎన్నటికీ నాశనం కాదు, అది ఇమ్మోర్టల్ అని చెపుతున్నాడు భగవంతుడు. అది చిరస్థాయిగా ఉంటుంది. ఈ లోకం ఆ లోకం అని లేదు, ఈ దేహం ఆ దేహం అని లేదు, ఇది సర్వత్రా వ్యాపించి ఉంది. దీనికి నాశనం అనేది లేనే లేదు అని ఘంటాపథంగా భగవంతుడు చెపుతున్నాడు.

మీ దగ్గర వంద రూపాయలు ఉంటే, పది రూపాయలు ఖర్చు పెడితే, పది రూపాయలు తరిగి తొంభై రూపాయలలోకి వస్తుంది. ఆత్మని అనుభవించే కొలదీ, ఈ బ్రహ్మవిద్యని అనుభవించే కొలదీ, ఈ శాంతిని సుఖాన్నీ మీరు అనుభవించే కొలదీ, ఇది తరగదు, ఇది తరగదు! ఎంత అనుభవించినా కానీ, ఇది పెరుగుతుంది కానీ తరగదు. దీనికి నాశనం లేదు అని భగవంతుడు మరోసారి మీకు చెపుతున్నాడు. నా మొదటి ధ్యేయం, చివరి ధ్యేయం, మొదటి కోరిక చివరి కోరిక ట్రూత్ - మీరు ఊరగాయ పెట్టుకొంటారు అనుకోండి, పక్కింటి వాళ్ళకు ఇంత ముద్ద పెడతారు. బాగుందా, అన్నీ

సరిపోయాయా అంటారు. ఒక్కసారి మీలో ఉన్న ఆత్మను మీరు కొంచెం రుచి చూస్తే, ఇంతకుముందు మీరు లోకంలో అనుభవించిన సుఖాలు, మీ శరీరంతోటి మీ ఇంద్రియాలతోటి మీరు అనుభవించిన సుఖాలు, మీ ఆత్మ సుఖంతోటి పోల్చుకుంటే ఇవి కోటో వంతు కూడా కాదు. అసలు ఎదుటివారు ఎవరైనా సుఖంగా ఉన్నారు అనుకోండి, దాని గురించి మీరు ఏడవటం ఏమిటి? దానివల్ల మీకు ఏమైనా కలిసివస్తుందా పోనీ ఏడవటం వల్ల? అన్ని చెడ్డ గుణాలలోని అసూయ కంటే చెడ్డ గుణం మరొకటి లేదు అసలు. ఓ అర్జునా! నీకు అసూయ అనే గుణం లేదు కాబట్టి నీకు ఈ శాస్త్రాన్ని చెపుతున్నాను అన్నాడు పరమాత్మ. రామానుజాచార్యులు వారి గురువుగారికి శిష్యుడి మీద అసూయ కలిగింది. కాశీ ప్రయాణం పెట్టాడు రామానుజుడిని దారిలో చంపేద్దామని. గోవిందుడు అనే ఇంకొక శిష్యుడు ఇది కనిపెట్టాడు. గోవిందుడు రహస్యంగా రామానుజాచార్యులవారికి చెప్పాడు పారిపొమ్మని. రామానుజుడు నాకు చావు అంటే భయం లేదు, ఈ దేహం నుంచి విడుదల చేస్తున్నారు వాళ్ళు, నేను ఎక్కడికీ పారిపోను అన్నాడు. అప్పుడు గోవిందుడు అన్నాడు, నీకు చావు అంటే భయం లేదని నాకు తెలుసు, నీ హృదయం ఎటువంటిదో, నీ సంస్కారం ఎటువంటిదో నాకు తెలుసు. కానీ నువ్వు తప్పనిసరిగా పారిపోవాలి, ఎందుకంటే మన గురువుగారిని మనం ప్రేమిస్తున్నాం. నువ్వు ఇక్కడ ఉంటే నిన్ను చంపేస్తాడు. ఈ పాతకం, ఈ పాపం మన గురువుగారికి చుట్టుకొంటుంది. అందుచేత మన గురువు గారికి ఈ దోషం రాకుండా రక్షించటం కోసం నువ్వు పారిపోవాలి అన్నాడు. అప్పుడు రామానుజుడు తలవంచాడు. వాడు శిష్యుడు అంటే!

ఈ చిన్న విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. ఏది అయితే మనకి చెడ్డ చేస్తుందో అదే మంచి అనుకొంటాము. అదే రాగం. రాగం అంటే ఇష్టం కాదు. రాగం అంటే చాలా మంది ఇష్టం అనుకుంటారు. ఇష్టం కాదు అక్కడ; ఏదైతే మనకి చెడ్డ చేస్తుందో అది మంచి అనుకొంటాము. అదే రాగం. మనం మంచి అనుకొన్నది ఎప్పటికైనా చెడ్డ చేసి తీరుతుంది. అదే రాగం. మీకు మంచి వచ్చేది ఒక్క ఆత్మలోంచే. ఆత్మని దర్శించిన వాడి దగ్గరనుంచి వస్తుంది, ఆత్మలోంచి మంచి వస్తుంది.

ఇంటికి సింహద్వారం ఎటువంటిదో, ఈ నోరు కూడా శరీరానికి అటువంటిది. ఈ నోరు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. లోపలికి వెళ్ళే తిండి విషయంలో, బయటికి వచ్చే మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. నాకు లోపలికి వెళ్ళే తిండి విషయంలో కొంత జాగ్రత్త ఉందేమో కానీ, ఈ లోపలినుంచి బయటికి వచ్చే మాటల విషయంలో

జాగ్రత్త లేదు. మాటలు నెమ్మదిగా మాట్లాడాలి, సంస్కారవంతంగా మాట్లాడాలి, శాంతిగా ఓర్పుగా మాట్లాడాలి, మీకు అర్థం అయ్యేలా మాట్లాడాలి. మీరు ఇంకోసారి అడిగితే చెప్పగలిగే నేర్పు ఉండాలి. ఇన్ని జాగ్రత్తలతో, మీకు కష్టం కలగకుండా, మీ అహంకారానికి దెబ్బ తగలకుండా, మీ మనస్సుకు నొప్పి కలగకుండా మాట్లాడాలి.

మీకు శరీరం ఉండవచ్చు, మనస్సు ఉండవచ్చు, డబ్బు ఉండవచ్చు, తెలివితేటలు ఉండవచ్చు, బుద్ధి ఉండవచ్చు, ఇవన్నీ ఉంటే సరిపోదు. వాటిని ఎలా ఉపయోగించుకోవాలో, ఎలా ఖర్చు పెట్టుకోవాలో తెలిసి వుండాలి. మిమ్మల్ని అందరినీ బీదవాళ్ళుగా ఉండమని, చదువులేని వాళ్ళుగా ఉండమని, బుద్ధిలేని వాళ్ళుగా ఉండమని నేను కోరటంలేదు. ఆ ఉన్నది ఎలా ఉపయోగించుకోవాలో తెలిసివుండి జీవించమని మీకు సవినయంగా మనవి చేసుకొంటున్నాను. వస్తువు మీ దగ్గర ఉండవచ్చు, దానికి తప్పులేదు. కానీ ఆ వస్తువుని ఎలా ఉపయోగించుకోవాలో మీకు తెలిసుండాలి. ఒక డాక్టరు ఉన్నాడు అనుకోండి, ఆయన చేతిలో ఆపరేషన్ చేసే ఆయుధాలు ఉంటాయి. కానీ ఎలా ఆపరేషన్ చెయ్యాలో తెలియకపోతే ఆయనకి ఉపయోగం లేదు. మీ ఇంద్రియాలు మీకు ఉన్నాయి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలో మీకు తెలియదనుకోండి, ఏం చేసుకుంటారు వాటిని? కూర వండుకొంటారా? మీ శరీరాన్ని, మీ ధనాన్ని, మీ తెలివిని, మీ మనస్సుని చెడ్డకి ఉపయోగించ వచ్చు, అదేవిధంగా మంచికి కూడా ఉపయోగించవచ్చు. మంచి చేస్తే పుణ్యం వస్తుంది, చెడ్డ చేస్తే పాపం వస్తుంది. పాపం పుణ్యం ఏనాటికైనా అనుభవించి తీరవలసిందే. మనం ఇవి రెండూ దాటాలి, ఈ పుణ్యాన్ని దాటాలి, ఈ పాపాన్ని దాటాలి.

నేను కర్తననే అహంకారాన్ని దగ్గర పెట్టుకోకుండా పని చేస్తే మీరు పుణ్యాన్ని, పాపాన్ని దాటిపోతారు. సాక్షాత్తుగా బ్రహ్మం వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. ఆ వస్తువుని ఎలా ఉపయో గించుకోవాలో తెలుసుకోండి, మీరు నేర్చుకోండి. మీ బుద్ధిని కర్రలాగా ఉపయోగించుకోవాలి, ఏదైనా జంతువు మన దగ్గరకి వస్తూ ఉంటే కర్రని ఎలా ఉపయోగించుకుంటామో, అలాగే మీ బుద్ధితోటి ఈ మాయకి అడ్డుపెట్టుకోండి. ఏరోజుకారోజు మన ఇంద్రియాలని, మనస్సుని, మాయ ఈడ్చుకుపోతుంది. కుక్క ఏదైనా వచ్చి మీద పడుతోంటే ఆ కుక్కని కర్ర పెట్టి ఎలా గెంటుతారో, అదేవిధంగా మీరు మాయలో పడకుండా మీ బుద్ధి అనే కర్రతో మాయని ఆపుచేసేయండి. మీలో ఆత్మగా ప్రకాశిస్తున్న వాసుదేవస్వామిని, ఏ మర్మం లేకుండా, రహస్యం లేకుండా, హృదయపూర్వకంగా మీరు ప్రేమించండి. హృదయంలో ఉన్న స్వామి మీ మనస్సుని

శుద్ధి చేస్తాడు, మీ బుద్ధిని శుద్ధి చేస్తాడు, దానికి మెరుగు పెడతాడు. మీ బుద్ధిలో ఉన్న వంకర్లు తీసేస్తాడు. మీకు లోపల ఆత్మని దర్శించే శక్తిని మీ బుద్ధికి ప్రసాదిస్తాడు. మీ లోపల ఉన్న ఆత్మని మీరు తెలుసుకోవాలంటే, మీ బుద్ధిలో ఉన్న దోషాలు పోవాలి. వాసుదేవస్వామి మీ బుద్ధిలో ఉన్న దోషాలు తీసేసి, మెరుగుపెట్టి, బాగుచేసి, దోషాలు లేకుండా కడిగేసి, ఆ లోపల ఉన్న నిజమైన ఆత్మ మీకు ఎటువంటి బుద్ధిని ఇస్తే దర్శనమౌతుందో అటువంటి బుద్ధిని వాసుదేవస్వామి మీకందరికీ ప్రసాదిస్తాడు. అయితే మీకు భక్తి ఉండాలి, విశ్వాసం ఉండాలి. భయం అంటే ఏమిటో తెలియని వాళ్ళు భక్తిగా ఉండగలరు.

చాలామంది అనుకొంటారు, భక్తి అంటే చాలా తేలిక అని. కానీ కష్టం. ప్రేమించటం నేర్చుకోండి, భక్తిగా ఉండటం నేర్చుకోండి. వాసుదేవుడే మీకు నిజమైన బంధువు, వాసుదేవుడే మీకు నిజమైన స్నేహితుడు. మీ గత జన్మలన్నీ, మీ రాబోయే జన్మలన్నీ వాసుదేవస్వామికి తెలుసు. రాబోయే జన్మల్లో మిమ్మల్ని ఎక్కడ పెట్టాలో, ఏ కుటుంబంలో పెట్టాలో, మిమ్మల్ని ఎలా ఉద్ధరించాలో, ఆయనే చూసుకొంటాడు. ఆయన మీద భారం వేయండి. ఈ సృష్టిలో భగవంతుడికంటే మిమ్మల్ని ప్రేమించేవాడు ఎవడూ లేడు. మిగతా ప్రేమలన్నీ అహంకారంతో ప్రేరేపితమైనవి. మిమ్మల్ని నిజంగా ప్రేమించేవాడు భగవంతుడు ఒక్కడే! అది నిజమైన ప్రేమ, యదార్థమైన ప్రేమ, అదే వాస్తవమైన ప్రేమ.

మీరు చిన్న అవమానాలే భరించలేనప్పుడు భగవంతుడిని ఎలా తెలుసుకుంటారు? సోదరమహాశయులారా! ఎవరైనా మిమ్మల్ని కష్టమైన మాట అంటే, బాధ కలిగించే మాట అంటే, ఆ ఈశ్వరుడే ఎదుటి మనిషిచేత ఆ మాట అనిపిస్తున్నాడు. ఎందుకు అనిపిస్తున్నాడు? మీ లోపల ఉన్న ఏవో రాళ్ళు బయటికి లాగటంకోసం అలా చేస్తున్నాడు, కానీ వాళ్ళు మిమ్మల్ని తిట్టేస్తున్నారు అని మీరు అనుకొంటున్నారు. మీ హృదయంలో ఏముందో తెలుసుకోవటం కోసం వాళ్ళచేత ఆ మాటలు అనిపిస్తున్నాడు. ఆ నాలుగు ముక్కలు వాళ్ళు అనకపోతే, మీ హృదయంలో ఏముందో మీకు తెలియదు. ఒక్కోసారి మంచివాళ్ళకి కూడా చెడ్డ మాటలు వచ్చేస్తాయి. రామకృష్ణ పరమహంస అంతటి గొప్పవాడు, భార్య మొట్టమొదటిసారి పుట్టింటి నుంచి వచ్చినప్పుడు, తండ్రిని తీసుకుని శారదాదేవి గుమ్మంలోకి వచ్చినప్పుడు, లోపలికి రామ్మా, అని కాళ్ళు కడుక్కోవటానికి చెంబుతో నీళ్ళు ఇవ్వలేదు, మావగారినీ భార్యనీ గౌరవించలేదు, ఏంటి మనం పిలవకుండా వచ్చేసింది ఏమిటి భార్య, కొత్తగా తీసుకొచ్చేటప్పుడు మనం కబురుపంపించాలి కదా అనుకొని మొహం పైకెత్తి నేను చేసుకొనే సాధనలని, పూజలని చెడగొట్టటానికి నువ్వు ఇంత దూరం వచ్చావా అన్నాడు. రామకృష్ణుడు అంతటివాడు

నోటివెంట రావలసిన మాటేనా అది? రామకృష్ణుడు ఎంత పరమపవిత్రుడు అంటే, పవిత్రత కూడా సిగ్గుపడి పక్కకి తప్పకొంటుంది. అంత పెర్ఫక్షన్, అంత ప్యూరిటీ మీకు అక్కడ కనిపిస్తుంది. ప్రాపంచిక సుఖం ఎలా ఉంటుందో నేను స్వప్నంలో కూడా చూడలేదు అన్నాడు. అటువంటి పరమపవిత్రుడైన రామకృష్ణుడి నోటివెంట ఆ మాట వచ్చింది. ఇదే దేహ ప్రారబ్ధం! నాకు ఆశ్చర్యం, శరీరం ఒక్కసారి గగుర్పాటు అయ్యింది. "నేను చేసుకొనే సాధనలు నువ్వు చెడగొట్టటానికి ఇంత దూరం వచ్చావా?" అన్నాడు. మామగారు పాపం నిర్ఘాంతపోయాడు, ఏమిటి ఇటువంటి పిచ్చపిచ్చ మాటలు అంటున్నాడు అని. శారద కూడా తక్కువ ఆవిడ కాదు. నువ్వు చేసే సాధనలు చెడగొట్టటానికి ఇంత దూరం రాలేదు, నీ సాధనకి సహకరించటానికి ఇంత దూరం వచ్చాను అంది. నోరు మూసేసాడు రామకృష్ణుడు. శారదామాత ప్రతిరోజు చంద్రుడి వంక చూసేదట. పౌర్ణమి రోజున చంద్రుడు పూర్ణంగా ఉంటాడు. అప్పడు పది నిమిషాలో, అరగంటో చంద్రుడిని చూసి, ఓ చంద్రుడా నీలో కూడా నాకు చిన్న మచ్చ కనిపిస్తోంది, నా జీవితానికి అటువంటి మచ్చ కూడా లేకుండా చూడు అని ప్రార్థించేది.

ఎంతసేపు చూసినా చావు చావు, చచ్చిన తరువాత ఏమౌతాము, ఇదే ప్రశ్న ఎవరు చూసినా. బ్రతికుండగా, ఈ శరీరం ఉండగా మాట వదిలేసి, చచ్చిన తరువాత ఏమౌతామని అడుగుతారు. చచ్చిపోయిన తరువాత ఏమౌతామని గొడవ ఎందుకంటే, ఇక్కడ నుంచీ తప్పించేసుకుని, ఈ వర్తమాన కాలాన్నంతా చంపేసి, నేను ఇక్కడినుంచి పారిపోవటంకోసం, ఎస్కేప్ అవ్వటానికి ఇదో సాధనం మనకి. బుద్ధికి పని చెప్పలేక, బుద్ధికి సోమరితనం అలవాటు అయిపోవటం వలననే ఇదంతా. కొంతమంది శరీరంతోటి ఎంత కష్టపడి అయినా పని చేస్తారు కానీ, మనం చిన్న విషయం అడిగి దీని గురించి కొంచెం ఆలోచించండి అంటే, వాళ్ళు ఆలోచించరు.

తలంపు లేకుండా దుఃఖం రావటంలేదు. అది జ్ఞాపకం ఉంచుకోండి, తలంపు లేకుండా దుఃఖపడిన వాళ్ళు జీవితంలో ఇక్కడ ఎవరైనా ఉన్నారా? అయితే ఈ తలంపు ఎక్కడినుంచి వస్తోంది? మీ గుండెకాయలోంచా, ఊపిరితిత్తులలోంచా, లేకపోతే పేగుల లోంచి వస్తోందా? మనుషులు అందరూ సమానమేనండి అంటారు. ఇది రాజకీయ స్లోగన్ లాంటిది. మనుషులు అందరూ సమానమైతే, నీకో తలంపు వస్తోంది, నాకో తలంపు వస్తోంది, ఈ అమ్మాయికో తలంపు వస్తోంది. మరి అలా మనుషులు అందరూ సమానమంటే, అలా ఫ్యాక్టరీలోంచి సరుకు వచ్చేసినట్టు మనుషులు అందరూ ప్రకృతిలోంచి

ఒకచోటు నుంచే వచ్చేస్తే, అందరికీ ఒకే తలంపు ఉండాలి, కానీ ఇన్ని తలంపులు ఎందుకు? పంచదార ఫ్యాక్టరీలో ఒక బస్తా ఒక రుచిగా, ఇంకో బస్తా ఒక రుచిగా ఉంటుందా? మీరు ఒక ఇంటిలోనే నలుగురు ఉంటే, నలుగురికీ సమానమైన తలంపులు ఎందుకు రావట్లేదు? ఇవన్నీ ఎప్పుడైనా కనీసం మీరు ఆలోచించారా ప్రశాంతంగా కూర్చుని? పరిష్కారం మాట వదిలేయండి.

తలంపు మీలోపలి నుంచి వస్తోంది. మీ లోపల ఎక్కడి నుంచి వస్తోంది? ఇప్పుడే చూడండి, వాయిదాలు వేసుకోవటం ఎందుకు? మనుషులు అందరూ సమానమైతే అందరికీ ఒకే తలంపు ఎందుకు రావట్లేదు? మనకున్న అలవాట్ల లోంచే తలంపులు వస్తాయి. ఈ అలవాట్లు ఎక్కడ నుంచి వచ్చాయి? మనం ఇప్పుడు జిన్నూరులో దేహంతోటి ఎలా ఉన్నామో, అలాగే పూర్వ దేహాలతోటి కూడా ఒకప్పుడు ఇలా ఉన్నాము. జిన్నూరులో లేకపోవచ్చు, ఎక్కడో ఒకచోట ఏదో ఒక దేహంతోటి ఉన్నాము కాబట్టి ఈ అలవాట్లు వచ్చాయి. అలవాట్లలోంచి తలంపులు వస్తాయి. మరి పూర్వజన్మలు అంటూ నిజంగా లేకపోతే, అందరూ సమానమైన అలవాట్లతోటి, సమానమైన తలంపులతోటి పుట్టాలి కదా! మీ జున్ను చాలా బాగుంది అని చెపుతున్నానంటే, నేను నిన్నో మొన్నో జున్ను తినే ఉండాలి, లేకపోతే ఎలా చెప్పగలుగుతున్నాను? నాకు అనుభవంలో లేకపోతే చెప్పలేను కదా! జున్ను చాలా బాగుంది అని నేను చెపుతున్నానంటే ఎప్పుడో ఒకప్పుడు, 10 సంవత్సరాల క్రిందటో, 20 సంవత్సరాల క్రిందటో నేను తిని ఉండాలి. అలా తిని ఉంటేనే స్మృతి వస్తుంది, నేను జున్ను ఎప్పుడూ తినలేదనుకోండి, తియ్యగా ఉంటుంది అని ఎలా చెప్పగలను?

మనం ఒక విషయంలో మటుకు బహుజాగ్రత్తగా ఉండాలి. మీకు ధనం ఉండవచ్చు, పొరపాటు లేదు, ధనం ఏమీ చెయ్యదు మిమ్మల్ని. ప్రమాదం ఎక్కడ వస్తోందంటే, ఉంది కదా అని ధనంతోటి మనం లేని అలవాట్లు చేసుకొంటున్నాము. అప్పుడేమౌతుందంటే, ఈ శరీరం పడిపోతుంది, ధనమూ పోతుంది, ఈ అలవాట్లు అన్నీ వచ్చే జన్మకి సిద్ధం అవుతాయి. పోనీ స్మశానంలో శరీరం కాలిపోయినప్పుడు అలవాట్లు కూడా కాలిపోతే పరవాలేదు. ఈ శరీరంలో నాకు సినిమా చూడటం బాగా అలవాటు ఉందనుకోండి, ఈ సినిమా చూసే కన్ను స్మశానంలో కాలిపోతుంది, కానీ సినిమా చూసే అలవాటు పోదు. మళ్ళీ జన్మలో రోజూ సినిమాకి వెళ్తానంటుంది. అంటే ఇంద్రియాలు కాలతాయి కానీ, ఇంద్రియాలకి సంబంధించిన వాసనలను స్మశానంలో పుల్లలు కాల్చలేవు. కానీ గత జన్మలు ఉన్నమాట నిజం అయితే, సరే అవి ఉన్నాయి, ఏవో వాసనలు వచ్చాయి, ఈ గత జన్మల గురించి

ఆలోచించటం ఎందుకు? ఇక అయిపోయాయి కదా!

అసలు ఇప్పుడు నాకు ఏ వాసన వల్ల, ఏ తలంపు వల్ల దుఃఖం వస్తోంది, నాకు ముల్లు గుచ్చుకొంది, నేను పాలకొల్లు నుంచి వస్తున్నాను, నేను ఇక్కడికి వచ్చి ముల్లు తీసేసుకోవాలా, ముల్లు తీసుకోవటం మానేసి, ఇది వంతెన వద్ద గుచ్చుకుందా, బ్రాడీపేటలో గుచ్చుకుందా అని ఆలోచించాలా? పోనీ వంతెనవద్ద గుచ్చుకొంది అని నేను కనిపెట్టాననుకోండి, దానివల్ల నాకు కలిసివచ్చేది ఏమిటి? ఈ గొడవ అంతా ఏమిటసలు? నాకు తలంపులు వస్తున్నాయి. ఇవి పూర్వజన్మలు ఉన్నాయో లేదో, పూర్వజన్మల నుంచి వస్తున్నాయో లేదో, ఏ రకంగా అయితేనేమి వచ్చాయి, ముల్లు గుచ్చుకుంది, ఆ ముల్లుని తీసేసుకుంటే నేను సుఖంగా ఉంటాను. ఏ తలంపు వల్ల నాకు దుఃఖం వస్తోందో, ఆ తలంపుని నేను తీసుకోవటం మానేసి, ఇది ఎక్కడినుంచి వచ్చింది అని ఆలోచిస్తే దుఃఖం ఎలా పోతుంది? చాలామంది భక్తి అంటే జీవితం నుంచి పారిపోవటం అని, జీవితానికి ఏమీ సంబంధం లేదని, మొద్దబ్బాయిలా కూర్చోవటం అని అనుకొంటారు. దీనికి ఆలోచన తోటి పని లేదని ఇలా అనుకొంటారు. చాలా పొరపాటు అభిప్రాయం అది. మిమ్మల్ని వివేకవంతులని చెయ్యటం కోసం ఈ మాటలు చెపుతున్నాను కానీ మిమ్మల్ని బానిసలని చెయ్యటంకోసం చెప్పటంలేదు.

ఇద్దరు బాటసారులు బయలుదేరి వస్తున్నారు, మామిడికాయలు బాగా కాసాయి, తినాలని బుద్ధి పుట్టింది ఇద్దరికీ. అందులో ఒకడు మామిడికాయలు కోసుకొని తిని, టెంక అక్కడ పారేసి వెళ్ళిపోయాడు. ఇంక రెండోవాడు బోటనీ ఏదో చదువుకొన్నాడు. ఈ చెట్టు ఎంతకాలము నుంచి ఉన్నది, బహుశా 100 సంవత్సరములు ఈ చెట్టుకి వయస్సు ఉండును, ఈ ఆకులు ఎంతకాలము నుంచి ఉన్నవి, ఈ చెట్టు ఎవరిది? ఈ ఊరివారిదే అయ్యి ఉండును, మొత్తం ఎన్ని రొబ్బలు ఉన్నవి, ఇలా లెక్కపెడుతూ వుంటే, ఆ చెట్టుగల ఆసామి వచ్చాడు అక్కడికి. కాయ తిన్నవాడు వెళ్ళిపోయాడు, వీడిని పట్టుకొని చితగ్గొట్టసాగాడు పాపం! బాబోయ్ నీ కాయలు నేను తినలేదు, ఈ చెట్టుకి ఆకులు వయస్సు లెక్కపెడుతున్నాను అన్నాడు. కాయలు తిన్నవాడు శుభ్రంగా వెళ్ళిపోయాడు. అదేవిధంగా ఈ ప్రపంచంలోకి వచ్చినవాళ్ళు కొందరు ఈ కాయ తిన్న వాడిలాగా ఇన్నర్ ఆత్మని తెలుసుకొని బయటికి వెళ్ళిపోతున్నారు, కాయ తిన్నవాడు ఎటువంటి వాడంటే, రమణ మహర్షి, బుద్ధుడు వంటివాడు. ఈ దెబ్బలు తిన్నవాడు, ఆకులు లెక్కపెట్టేవాడు మనం!